క్రొత్త సీరియల్ ప్రారంభం

రాక్షసహేల

వాణిశ్రీ

విజయ నెత్తిన పిడుగు పడినట్లు అదిరిపోయింది. శరీరంలో రక్తమంతా నీరై పోయినట్లు నీరసపడిపోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగి మసక మసకగా కన్పించాయి పరిసరాలు.

సోఫాలో కూలబడిపోయింది.

“అంకుల్! మీరు చెప్పేదంతా నిజమేనా?” అని హీనస్వరంతో ప్రశ్నించింది విజయ.

“రేపో మాపో చావబోతున్నవాడిని అబద్ధం ఎందుకు చెప్తానమ్మా? ఈ నిజాన్ని ఇన్నాళ్ళూ ఎవ్వరికీ చెప్పకుండా కడుపులో దాచుకున్నాను. బైటపడితే సర్వనాశనం చేస్తారని భయంతో నోరు మెదపలేకపోయాను. ఇప్పుడిక దాచుకోలేకపోయాను.”

జోగారావు దగ్గు తెర వచ్చి మాట్లాడలేకపోయాడు.

విజయ కొంచెంసేపు మాటా పలుకూ లేకుండా జోగారావు వైపు చూస్తూ వుండిపోయింది.

జోగారావు ఆరేళ్ళ క్రితం పక్షవాతంతో మంచాన పడ్డాడు. అప్పట్నుంచి అనారోగ్యంగానే వుంది. ఇప్పుడు మనిషి మరీ నీరసించిపోయాడు. మాటకూడా స్పష్టంగా రావడంలేదు. ఇక ఎక్కువరోజులు నెట్టుకొచ్చేటట్లుగా కనిపించటంలేదు.

కిరణ్ టెలిగ్రామ్ అందగానే నాయనమ్మతో కలిసి వెంటనే బయల్దేరి వచ్చింది విజయ.

ఆమెకు వూహ వచ్చినప్పట్నుంచి జోగారావు వాళ్ళ భూములు చూస్తున్నాడు. సంవత్సరానికొకసారి మద్రాస్ నుంచి అనందపురం వచ్చి పంటమీద వచ్చే ఆదాయం తీసుకెళ్ళడం తప్పితే కుటుంబం గురించి వివరాలు ఆమెకు పూర్తిగా తెలియవు. నాయనమ్మ భవానీదేవి విజయను అలా పెంచింది.

తనకు రెండేళ్ళ వయస్సున్నప్పుడు తల్లిదండ్రుల్ని దొంగలు కొట్టి చంపి డబ్బు, నగలు దోచుకుపోయారని మాత్రమే ఆమెకు తెలుసుగాని దాని వెనుక ఇంత కథ వుందని తెలియదు.

ఇప్పుడు జోగారావు అవసాన దశలో నిజం చెప్తుంటే షాక్ తిన్నట్లు అయిపోయింది.

ఆ ఫోటోవైపు కళ్ళార్పకుండా చూసింది. మధ్యలో తండ్రి బ్రహ్మాజీ, తల్లి సుజనాదేవి కూర్చున్నారు. వాళ్ళతోపాటు కూర్చున్న నలుగురు ప్రాణస్నేహితులు.

ఆ ప్రాణస్నేహితులే డబ్బుకోసం, బంగారం కోసం ప్రాణాలు తీశారు.

'ఎంత భయంకరమైన నిజం!

సంవత్సరం పొడుగునా మద్రాస్‌లో కాలం గడిపిన ఆమెకు అనందపురం రాగానే మండుటెండలో నుంచి తల్లిఒడిలోకి వచ్చి వాలినట్లు అనిపించేది.

పది ఎకరాల స్థలంలో మూడంతస్తుల మేడ. చుట్టూ పది అడుగుల ఎత్తున పాటి మట్టి కోటగోడ. మధ్యలో మామిడి, సపోట, నారింజ చెట్లతో గుబురుగా తోట. సింహద్వారం ప్రక్కనే భవానీదేవి గుడి. కోనేరులో

తామరపూలు. విజయకు అక్కడున్నన్నాళ్ళూ స్వర్గంలో వున్నట్లు అనిపించేది.

ఊరికి చివరగా వంద ఎకరాల మామిడితోట. అందులో గెస్టు హౌస్ కూడా వున్నాయి. అదిగాక ఏభై ఎకరాల మాగాణి వుంది. అవన్నీ జోగారావే మేనేజ్ చేస్తుండేవాడు.

ఇన్నాళ్ళూ తల్లిదండ్రులు దొంగల చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్నారనే అనుకునేది. కాని ప్రాణస్నేహితుల నమ్మకద్రోహంతో చంపబడ్డారని తెలిసి ఆమె మెదడు మొద్దుబారిపోయింది. ప్రపంచం శూన్యంగా కనిపించింది.

తను ఏన్నడూ చూడని తల్లిదండ్రులు స్నేహితుల దుర్మార్గానికి బలైపోయారని తెలిసి ఆమె రక్తంలో చలనం కలిగించింది. శరీరం వుడికిపోయింది.

జోగారావు పిలుస్తున్నా వినిపించుకోకుండా ఆమె చరచర నడిచింది.

జీప్ ఎక్కి స్పీడ్ ఎక్కించింది. దుమ్మురేపుకుంటూ విమానంలా పోతున్న జీప్ ని నోళ్ళు తెరిచి చూశారు ఆ వీధిలో వాళ్ళు.

"నాన్నా! విజయ వెళ్ళిపోయిందా?" ఆశ్చర్యపోతూ అడిగాడు కిరణ్.

జోగారావు తల వూపాడు నీరసంగా.

"చెప్పకుండా వెళ్ళిపోయిందేమిటి? కొత్త కాసెట్ తెచ్చాను సినిమా చూపిస్తానని చెప్పిందే!" అన్నాడు.

విజయ తనకు చెప్పకుండా వెళ్ళిపోవడం అతనికి వింతగా అనిపించింది,

2

భవానీదేవి టీ.వీ.లో వస్తున్న తెలుగు వార్తలు చూస్తోంది. రాత్రి ఏడున్నర దాటింది.

ఆ గది విశాలంగా వుంది. గోడలు గులాబీ రంగులో వున్నాయి. మధ్యలో పెద్ద ఛాండలీర్ వెలుగులు విరజిమ్ముతోంది. గోడలకు అక్కడక్కడ జింక కొమ్ములు అమర్చి వున్నాయి. గది మధ్యలో వున్న పెద్ద పట్టె మంచం, తెల్లటి దోమ తెర వున్నాయి.

గోడకు నిలువెత్తు ఆయిల్ పెయింట్‌లో తుపాకీ పట్టుకుని వుండగా, ఠీవిగానిల్చున్న రాజావారున్నారు. ఆయన కాళ్ళదగ్గర చచ్చిపడివున్న పెద్ద పులి వుంది. ఆ చిత్రం ఫ్రేమ్ చుట్టూ పెద్ద పులిగోళ్ళతో తయారుచేసిన హారం వుంది. దానికి ఎన్ని గోళ్ళున్నాయో చెప్పడం కష్టం. వంద గోళ్ళపైనే వుండొచ్చు. ఆయన రాజా శ్యామ్‌సుందరప్రసాద్. భవానీదేవి భర్త.

ఆ భవనంలో లెక్కలేనన్ని గదులున్నా, భవానీదేవి మద్రాస్ నుంచి వచ్చినప్పుడు రెండు గదులు, ఒక హాలు మాత్రమే వాడుతుంటుంది. మిగిలిన గదులన్నీ తాళాలు బిగించి వుంటాయి. వాటిలో అలనాటి జమీందారీ ఫర్నిచర్, పాత్ర సామాను వగైరాలుంటాయి.

విజయ చరచర వచ్చి మంచంమీద వాలిపోయింది. ఆమె ముఖం గంభీరంగా వుంది. ఎర్రబడి వచ్చినట్లు కనిపిస్తోంది. మనుమరాలు మాటా పలుకూ లేకుండా వచ్చి పడుకోవడం భవానీదేవికి అసహజంగా కనిపించింది. టి.వి. ఆఫ్ చేసి దగ్గరగా వచ్చింది.

"అలా వున్నావేమిటమ్మా? వంట్లో బాగాలేదా?" అంది విజయ నుదిటిమీద చెయ్యివేసి.

విజయ లేచి కూర్చుంది.

"అమ్మా! నేనొకటి అడుగుతాను నిజం చెప్పు" అంది నాయనమ్మ ముఖంలోకి సూటిగా చూస్తూ.

విజయ చిన్నతనం నుంచి ఆమెను 'అమ్మా' అనే పిలుస్తుంది.

భవానీదేవి నివ్వెరపోయింది.

"నేనెప్పుడు అబద్ధం చెప్పానమ్మా నీకు?" అని యెదురుప్రశ్న వేసింది.

"అమ్మా, నాన్న ఎలా చనిపోయారో చెప్పు. వివరంగా చెప్పాలి. ఆ రోజు నీకు బాగా గుర్తుండే వుంటుంది" అంది విజయ వణుకుతున్న కంఠంతో.

"అదంతా ఎందుకమ్మా! ఇప్పుడు?"

"తెలుసుకోవాలనుకుంటున్నాను."

భవానీదేవి దీర్ఘంగా నిట్టూర్చి చెప్పటం ప్రారంభించింది:

"అప్పుడు నీకు రెండు సంవత్సరాలు.

హైదరాబాద్ నుంచి నాన్నగారి స్నేహితులు నలుగురు వచ్చారు. అందులో అవతారకృష్ణ నాన్నగారితోపాటు చదువుకున్నాడు. హైదరాబాద్‌లో స్టీల్ వ్యాపారం చేస్తున్నాడు. అప్పుడప్పుడు డబ్బు అప్పుగా తీసికెళ్ళి ఇస్తుండేవాడు. మిగిలిన ముగ్గురు అతని ద్వారా నాన్నకి స్నేహితులు.

మామూలుగానే అవతారకృష్ణ పదిలక్షలు అప్పు కావాలని వచ్చాడు. అంతకుముందెప్పుడు అంత డబ్బు అడగలేదు. లక్ష, రెండు లక్షలు తీసికెళ్ళి అర్ధరూపాయి వడ్డీతో తిరిగి ఇస్తుండేవాడు. అంత డబ్బు రెడీగా లేదు. బాంక్‌లో డ్రా చేసి ఇస్తానని అందరూ కలసి కారులో

ఏలూరు వెళ్ళారు. వాళ్ళతో పాటు మీ అమ్మగూడా వెళ్ళింది.

డబ్బు తీసుకుని అట్నుంచి అటు వెళ్ళిపోతామని అవతారకృష్ణ అంటే మీ నాన్న ఒప్పుకోలేదు. ఆనంద పురంలో రెండు రోజులు వుండి వెళ్ళమని బలవంతంచేసి తీసుకుని వస్తున్నారు. అందరూ ఫస్టు షో సినిమా చూసి తిరిగివస్తుంటే దారిలో దొంగలు అటకాయించారు.

"మీ నాన్న డబ్బున్న సూట్ కేసు ఇవ్వలేదు. ప్రతి ఘటించాడు. మీ అమ్మగూడా నగలు ఇవ్వనని మొండి కేసింది. ఆ పాపిష్టి డబ్బు, నగల కోసం దొంగలు వాళ్ళిద్దర్నీ కత్తులతో పొడిచి చంపారమ్మా. మీ నాన్న స్నేహితుల్ని కూడా కొట్టారు."

భవానీదేవికి అదంతా గుర్తుకొచ్చి దుఃఖం ముంచు కొచ్చింది. నోటికి చేతులు అడ్డం పెట్టుకుని రాబోతున్న ఏడుపు ఆపుకోవాలని ప్రయత్నించింది. కాని లాభం లేకపోయింది. వెక్కి వెక్కి ఏడ్చింది.

"అంతా అబద్ధం" గట్టిగా అరిచింది విజయ.

భవానీదేవి కళ్ళు తుడుచుకుంటూ ఆశ్చర్యంగా చూసింది.

"ఏమిటమ్మా! నువ్వనేది?"

"నువ్వు చెప్పిందంతా కట్టుకథ."

ఆమె స్థాణువై పోయింది.

"నీ కిదంతా యెవరు చెప్పారు?" ప్రశ్నించింది విజయ.

"జోగారావు చెప్పాడమ్మా! అతను యెప్పుడూ నాన్నగారితోనే వుండేవాడు. అప్పుడూ వున్నాడు."

"లేదమ్మా! నాన్నగారిని, అమ్మని దొంగలు చంప

లేదు. నాన్న స్నేహితులే చంపారు. డబ్బు, నగలు కాజేసి అడవిలో పాతిపెట్టారు. ఈ సంగతి బైటపెడితే కుటుంబంతో సహా అందర్నీ చంపుతామని జోగారావుని భయపెట్టారు. ప్రాణంమీది తీపితో జోగారావు ఈ నిజం ఎవరికీ చెప్పలేకపోయాడు.''

భవానీదేవి కుప్పకూలి పోయింది ఆ సంగతి విని.

''ఇప్పుడు ఎవరు చెప్పారమ్మా అదంతా?''

''జోగారావే చెడప్పావమ్మా! ఎటూ చనిపోతున్నానని తెలిసి ఇన్నాళ్టికి నిజం చెప్పాడు. మనసులో దాచుకోలేకపోయాడు'' అంది విజయ.

''ఇప్పుడు చెప్పి యేం లాభం? అప్పుడే తెలియచేస్తే ఆ దుర్మార్గుల్ని ఉరికంబం ఎక్కించేదాన్ని'' ఆవేశంలో అంది భవానీదేవి.

''ఇప్పటికీ మించిపోయిందేం లేదమ్మా! అమ్మని, నాన్నని దుర్మార్గంగా చంపిన ఆ రాక్షసుల్ని ప్రాణాలతో వదిలిపెట్టను. వాళ్ళని చంపితేగాని నా మనసు ప్రశాంతంగా వుండదు'' వణుకుతున్న కంఠంతో అంది విజయ.

''పిచ్చి తల్లీ! ఇప్పుడు వాళ్ళెక్కడ వున్నారో? చచ్చారో, బతికారో తెలీదు. ఎక్కడని వెతుకుతావు? యెట్లా చంపుతావు. రోజులు మారిపోయాయమ్మా! మనిషిని హత్య చేస్తే పోలీసులకు దొరికిపోతావు'' అంది భవానీదేవి.

''రోజులు మారినా, నా వంట్లో ప్రవహిస్తున్న నాన్న రక్తం మారుతుందా అమ్మా!''

''ఆవేశంతో అంటున్నావుగాని ఒకర్ని కాదు, నలుగుర్ని వెతికి పట్టుకుని చంపడం నీవల్ల అవుతుందా తల్లీ?

అదెంత కష్టసాధ్యమో ఆలోచించావా?"

"ఎంత కష్టమైనా సాధిస్తాను. మనిషికి అసాధ్యమైనది ఈ ప్రపంచంలో ఏదీ లేదమ్మా!"

"వద్దమ్మా! నీది పసివయస్సు. అనుభవం లేదు. పెళ్ళి చేసుకుని, పిల్లాపాపలతో గడపాల్సిన సమయంలో పగ, ప్రతీకారం అంటూ లేనిపోని కష్టాలు కొనితెచ్చుకుంటావా? వద్దమ్మా! వద్దు" అంది భవానిదేవి.

"హూఁ....అమ్మా! నువ్వేనా మాట్లాడుతున్నది. ఒక జమీందారు కూతురివి, మరొక జమీందారు భార్యవి, కన్నతల్లివి యింత పిరికిదానివి యెలా అయ్యావు?"

"గతించిన గతం తవ్వుకుని, అక్కరకురాని పోరుపాలవల్ల జీవితం వ్యర్థం కావడం తప్ప ప్రయోజనం ఏమీ లేదమ్మా! సూర్యవంశం, చంద్రవంశం, ఆ జమీందారీలు అన్నీ పోయాయి."

"ఏది పోయినా మనిషి గుణం మారదమ్మా! నాన్న, అమ్మ స్నేహితుల చేతిలో నే దుర్మార్గంగా చంపబడ్డారని విన్నవేళ నా రక్తం వుడికిపోయింది. నా మనసు ప్రతీకారం తీర్చుకోమని ఆదేశిస్తున్నదమ్మా! జీవితాంతం అశాంతితో కుమిలిపోయేదానికన్నా, దానికి కారణమైన పగ తీర్చుకుని కొద్దిరోజులయినా తృప్తిగా బ్రతుకుతానమ్మా....!" ఆవేశంతో యెర్రబడిపోయింది విజయ ముఖం.

భవానీదేవి ఆశ్చర్యంతో విజయను తదేకంగా చూసింది. కొత్తగా ఎవర్నో చూస్తున్నట్లుగా భ్రమ కలిగింది. ఆమె ఆవేశం, పట్టుదల చూస్తూంటే తనకి కూడా

నెత్తురు మరుగుతున్నట్టు, నరాల్లో సంచలనం బయల్దేరి నట్టు అవుతోంది.

విజయ పట్టిన
పట్టు వదలదని ఆమెకు తెలుసు.

3

నాంపల్లిలో రైలు దిగిన తర్వాత ఎక్కడికి పోవాలో అర్థం కాలేదు రాజయ్యకి. సరస్వతి అయోమయంగా చూసింది. రైలు దిగిన ప్రయాణీకులు ఒక్కొక్కరే వెళ్ళి పోతుంటే వాళ్ళూ గేటు దాటి బయటకు వచ్చారు.

రిక్షావాళ్ళు, ఆటోలవాళ్ళు మూగారు. వాళ్ళని తప్పించుకుని రోడ్డుమీద పడ్డారు. హైదరాబాద్ వాళ్ళకి కొత్త. తెలియకుండా ఆటోగాని, రిక్షాగాని యెక్కితే యెక్కడికి తీసుకెళ్తారో యేమోనని రాజయ్యకు భయం. అతని స్నేహితుడు సింహాద్రి ఆల్విన్‌లో పని చేస్తున్నాడు. అతని దగ్గరికి వెళ్ళాలి.

కానీ అర్ధరాత్రి దాటింది.

ఇప్పుడా ఫ్యాక్టరీ తీసివుంటుందా? సింహాద్రి ఇప్పుడు వుంటాడా?

అనవసరంగా వెళ్ళడం యెందుకు? తెల్లవారి వెళ్తే బాగుంటుందని రాజయ్య అనుకున్నాడు.

తెల్లవారే వరకూ యెక్కడ వుండా అన్నదే సమస్య.

ఎదురుగా వున్న హోటల్లో రూమ్ వుందేమో అడిగాడు. రాజయ్య ముఖం చూసీ చూడనట్టుగా చూసి "నై....జావ్...." అన్నాడు రిసెప్షన్‌లో వున్న పెద్ద మనిషి.

రాజయ్య చేతిలో సూట్‌కేస్ వుంది.

సరస్వతి భుజానికి జిప్ బ్యాగ్ వ్రేలాడుతున్నది.

రోడ్డుకి అటూ యిటూ చూసుకుంటూ బయల్దేరారు. ఎక్కడికో వాళ్ళకే తెలీదు. తెల్లవారేవరకూ గడప డానికి ఏదయినా మరుగు దొరుకుతుందేమోనని రాజయ్య ఆశ.

లైట్లు పట్టపగల్లా వెలుగుతున్నాయి.

అప్పుడప్పుడు కార్లు, బస్సులు లారీలు వెళ్తున్నాయి.

కొంతదూరం నడిచాక చీకటిగా వుంది.

సరిగ్గా అక్కడే వాళ్ళముందు సరికొత్త బెంజికారు సడెన్ బ్రేక్‌తో ఆగింది.

రాజయ్య భయంగా చూశాడు.

సరస్వతి రాజయ్య వెనక్కి వెళ్ళి దాక్కుంది.

కారులో నుంచి నలుగురు కుర్రాళ్ళు దిగారు. జీన్స ప్యాంట్స్, హిప్పీ క్రాఫ్, కళ్ళజోళ్ళు, దుబ్బు మీసాలు, చూడ్డానికి భయం కలిగించేలా వున్నారు. బాగా తాగి వున్నట్లు వాళ్ళ వాలకమే చెప్తోంది.

"ఎవర్రా నువ్వు?" అన్నాడు ఎర్ర గళ్ళచొక్కా వున్న కుర్రాడు.

"నా పేరు రాజయ్యండి."

"ఎక్కడ్నుంచి వస్తున్నావ్?"

"రైలు దిగి వస్తున్నానండి."

"ఏ వూరునుంచి?"

"షోలాపూరండి."

"ఈ పిల్లెవరు?"

"నా కాబోయే పెళ్ళామండి."

"అంటే లేపుకొస్తున్నావన్నమాట."

"లేదండి. వాళ్ళ నాన్న పెళ్ళికి ఒప్పుకోలేదండి.

అందుకని యిప్పుడు పెళ్ళి చేసుకుని మళ్ళీ పోతానండి...."

"బద్మాష్. ఆ పిల్లను లేపుకొచ్చింది గాక కథలు చెప్తున్నావురా?...." అని అతను రాజయ్యని ఒక్క తోపు తోసి ఆ పిల్లని పట్టుకున్నాడు.

సరస్వతి గావుకేక పెట్టింది. ఇద్దరు ఆమె నోరు మూసి కారులోకి నెట్టారు. రాజయ్య తిరగబడ్డాడుగాని నలుగురి ముందు ఆగలేకపోయాడు. అతని చొక్కా చిరిగింది. మూతికి దెబ్బ తగిలి నెత్తురు కారుతోంది.

సరస్వతిని ఎక్కించుకున్న కారు కదిలింది. రాజయ్య రోడ్డుమీద బోర్లాపడ్డాడు. లేచి కేకలు వెయ్యసాగాడు.

అప్పుడు పోలీస్ జీప్ అతని పక్కనే ఆగింది.

"ఏమైంది?...." సబ్ ఇన్‌స్పెక్టర్ విజయ ప్రశ్నించింది.

రాజయ్య ఏడుస్తూ జరిగింది చెప్పాడు.

"ఎక్కు" అంది యస్.ఐ.

రాజయ్య జీప్ ఎక్కాడు.

పోలీస్ జీప్ విమానంలా పరిగెత్తింది. వెనుక కూర్చున్న ఆడ కాన్‌స్టేబుల్స్ ఆ వేగానికి హడలిపోయారు. ప్రాణాలు బిగపట్టుకుని కూర్చున్నారు.

వెనుక పోలీసు జీప్ వస్తున్నదని తెలుసుకున్న బెంజి కారు స్పీడ్ పెరిగింది.

ఎర్రగడ్డ దగ్గర పెట్రోలు అయిపోయి ఆగిపోయింది కారు.

బెంజి కారు ముందు ఆగింది పోలీస్ జీప్. జీపులో నుంచి యస్.ఐ., కానిస్టేబుల్స్ దిగారు. కాని కారులో

వాళ్ళు దిగలేదు.

"రాస్కెల్స్ దిగండిరా" అంది విజయ కోపంగా.

"మేడమ్! మర్యాదగా మాట్లాడు" అన్నాడు డ్రైవింగ్ సీట్లో కూర్చుని నిర్భయంగా చూస్తున్న ఎర్ర గళ్ళ చొక్కా కుర్రాడు.

"నీకు మర్యాద కావాల్రా! రాస్కెల్!" అని చెయ్యి పట్టుకుని ఒక్క వూపు వూపింది విజయ.

డోర్ తో సహా తెరుచుకుని రోడ్డుమీద పడ్డాడు.

"ఊఁ.... జీప్ ఎక్కించండి స్కౌండ్రల్స్ ని."

కానిస్టేబుల్స్ అందరినీ కలిపి జీపులో యెక్కించారు.

సరస్వతి ఏడుస్తోంది.

టెంజీకారు టైర్లు చాకుతో కోసేసింది విజయ. తుస్సు తుస్సుమని గాలి పోయింది.

"నే నెవరో తెలుసా?...." అంటున్నాడు ఆ కుర్రాడు.

"నువ్వెవడివో స్టేషన్ లో వింటాన్రా!" అంది విజయ.

"నిన్ను సస్పెండ్ చేయిస్తాను. ఏమనుకున్నావో!"

ఆ కుర్రాడి వీపుమీద లాఠీదెబ్బ పడింది.

"షటప్ యువర్ మౌత్" అంది హూంకరిస్తూ.

పోలీస్ స్టేషన్ ముందు జీప్ ఆగింది.

రాత్రి రెండు గంటలయింది.

రాజయ్య, సరస్వతి తాము హైదరాబాద్ ఎందుకు వచ్చారో చెప్పారు. వాళ్ళని స్టేషన్ లో కూర్చోబెట్టి రైలు దిగిన తర్వాత ఏం జరిగిందో స్టేట్ మెంట్ రాయించి సంతకాలు చేయించింది విజయ.

నలుగురు కుర్రాళ్ళ చేతులకు కఫ్స్ తొడిగి నిలబెట్టింది. ఎదురుగా కుర్చీలో కూర్చుంది విజయ.

ఇన్‌స్పెక్టర్ దుస్తుల్లో వున్న ఆమె వాళ్ళ కళ్ళకి కాళి కలా కనిపిస్తోంది.

ఎర్ర గళ్ళ చొక్కా కుర్రవాడిని ప్రశ్నించింది.

"నీ పేరేమిట్రా?"

"సురేంద్ర" అవమాన భారంతో, జేవురించిన ముఖంతో చెప్పాడు అతను.

"ఎవర్రా మీ నాన్న?"

"హోమ్ మినిష్టర్."

ఆ మాట విని ఉలిక్కిపడింది విజయ. కళ్ళు పెద్దవి చేసి అతన్ని చూసింది. చేతిలోని లాఠీ బిగుసుకుంది. కుర్చీలోంచి సడెన్‌గా లేచింది.

"రాస్కెల్! హోమ్ మినిష్టర్ కొడుకునని చెప్తున్నావా? సిగ్గులేదూ! మీ నాన్న అధికారం అంతా నీ చేతిలో వుందని నీలుగుతున్నావా?"

లాఠీ గాల్లో లేచింది. అందిన చోటల్లా కొట్టింది. రొప్పు వచ్చేవరకు చెయ్యి ఆడుతూనే వుంది.

"ప్లీజ్ మేడమ్! కొట్టొద్దు. ఇంకెప్పుడూ చెయ్యను" అతను కేకలు పెట్టాడు.

స్టేషన్‌లో వున్న కాన్‌స్టేబుల్స్ అంతా నోళ్ళు తెరిచి చూస్తున్నారు.

హోమ్ మినిష్టర్ కొడుకు అని తెలిసి కుళ్ళబొడవడం ఎంత సాహసం?

'ఇక ఈవిడ ఉద్యోగానికి నీళ్ళు వదులుకోవాల్సిందే' అనుకున్నారు.

"ఈ రాస్కెల్స్‌ని లాకప్‌లో పడెయ్యండి. కఫ్స్

గూడా తిరొయ్యొద్దు....” అంది విజయ ఆవేశంతో వణికి పోతూ.

తర్వాత రెండు గ్లాసులు మంచినీళ్ళు త్రాగింది.

టెలిఫోన్ ముందు కూర్చుని డైరెక్టరీ తిరగేసింది. దినపత్రికల టెలిఫోన్ నెంబర్స్ నోట్ చేసుకుంది. ఒక్కొక్క నెంబరే రింగ్ చేసింది.

“హల్లో ఈజిట్ ఈ రోజు డెయిలీ?”

“యస్.”

“హూ ఈజ్ స్పీకింగ్?”

“ఇన్ చార్జి ఎడిటర్.”

“రేపటి పేపరు ప్రింటయిందా?”

“కొన్ని డిస్ట్రిక్ట్స్ పేపర్లు ప్రింటవుతున్నాయి. ఎవరు మీరు?”

“నేను సబ్ ఇన్ స్పెక్టర్ విజయని మాట్లాడుతున్నాను.”

“చెప్పండి మేడమ్.”

“ముఖ్యమైన వార్త వుంది. సిటీ ఎడిషన్ లో ప్రింట్ చెయ్యడానికి వీలుంటుందా?”

“ముఖ్యమయిన వార్త అయితే ఫ్రంట్ పేజీలో వెయ్యొచ్చు.”

“హోమ్ మినిస్టర్ కొడుకు సురేంద్ర, సరస్వతి అనే అమ్మాయిని కిడ్నాప్ చేసి తీసుకుపోతుండగా రెడ్ హేండెడ్ గా పట్టుకున్నాను. ఎర్రగడ్డ దగ్గర కారు ఆపి టైర్లు కోసేశాను.”

“ఈజిట్?”

“యస్.”

“పోలీస్ కమీషనర్ గారికి ఫోన్ చేసి కన్ఫరమ్

చేసుకోమంటారా?"

విజయ నవ్వింది.

"ఈ వార్త కమీషనర్కి చెప్తే పేపర్లో రాదు. రావాలంటే మీరు పోలీస్ స్టేషన్కి మీ వాళ్ళని ఎవర్నయినా పంపండి. అతని ఫోటో కూడా తీసుకోవచ్చు."

4

మర్నాడు దినపత్రికల మొదటి పేజీలలో హోమ్ మినిష్టర్ కొడుకు రాత్రి చేసిన నిర్వాకం బాక్స్ కట్టి ప్రచురించబడింది. కొన్ని పత్రికలవాళ్ళు రాజయ్య, సరస్వతి ఫోటో వాళ్ళతో ఇంటర్వ్యూ, హోమ్ మినిష్టర్ కొడుకు ఫోటోతో సహా ప్రముఖంగా వేశారు—

ఒక దినపత్రిక ఎడిటర్, హోమ్ మినిష్టర్కి ఫోన్ చేశాడు. కాని ఇంట్లో యెవరూ లేరనీ, అంతా పెళ్ళికి మద్రాస్ వెళ్ళారని తెలిసింది. రాత్రి మూడు గంటల నుంచి ట్రైచేస్తుంటే మద్రాసులో ఒక సినిమా స్టార్ యింట్లో దొరికాడు హోమ్ మినిష్టర్. అప్పుడు టైమ్ నాలుగున్నరయింది. తన పరువు మంటగలిపిన యస్.ఐ. మీద కారాలు, మిరియాలు నూరుతూ ఎయిర్పోర్టుకి వెళ్ళాడు.

మద్రాస్, హైదరాబాద్ ఫ్లైట్ ఉదయం ఆరు గంటలకు బయల్దేరింది. ఏడుగంటలకు బేగంపేటలో దిగాడు హోమ్ మినిష్టర్.

అప్పటికి నగరంలోను, కొన్ని జిల్లాలలోను కిడ్నాప్ వార్త కొన్ని లక్షలమంది చదువుతున్నారు. చదివారు. పక్కింటివాళ్ళతో డిస్కస్ చేస్తున్నారు కూడా.

పోలీస్ ఉన్నతాధికారుల గుండెల్లో రైలింజన్లు పరిగెత్తుతున్నాయి. అసలు యస్. ఐ. విజయ ఎవరో చాలా మందికి తెలియనే తెలియదు. ఇంత గడుగ్గాయి ఇన్నాళ్ళూ సిటీలో యెట్లా ఉద్యోగం చేస్తున్నదో వాళ్ళకి అంతుబట్టలేదు.

హోమ్ మినిష్టర్ నివాసగృహానికి చేరుతూనే ఐ.జి.కి ఫోన్ చేశాడు.

ఆయనింకా లేవలేదు. నిద్రలేపి మంగళహారతి పాడాడు హోమ్ మినిష్టర్.

"గుడ్ మార్నింగ్ సర్" అన్నాడు ఐ.జి. కళ్ళు నులుముకుంటూ.

"పేపరు చూశారా ఐ జి.గారూ!"

"ఏ పేపరు సర్!"

"మీరు ఏ పేపరు చూస్తారు?"

"అన్ని పేపర్లూ చూస్తాను సర్."

"ఏదోక పేపరు చూడండి."

"వాటీజ్ రాంగ్ సర్?"

"మా అబ్బాయిని మీ ఆడ యస్ ఐ. లాకప్‌లో తోసింది. పేపర్లన్నింటికి ఇన్ఫర్మేషన్ ఇచ్చింది. చూడండి, బాక్సులు కట్టి మరీ వేశారు."

"ఈజిట్?"

"తమరే చూడండి."

"ఇటీస్ వెరీ బాడ్.... వెరీ వెరీ బాడ్ ఆన్ ది పార్ట్ ఆఫ్ ది యస్.ఐ. ఐ విల్ సస్పెండ్ హర్ ఇమ్మీడియట్లీ"

"ఆ పని చెయ్యకండి. అపొజిషన్ వాళ్ళు పెద్ద గొడవ చేస్తారు."

"తమరేం చెయ్యమంటారు?"

"ఏం చేస్తారో మీ ఇష్టం" హోమ్ మినిష్టరు కోపంగా ఫోన్ రిసీవర్ విసిరిపడేశాడు.

"ఐ.జి. తల పట్టుకుని కూర్చున్నాడు కొంతసేపు.

"కాఫీ...." అని గావుకేక పెట్టాడు.

తర్వాత టెలిఫోన్ రిసీవర్ ఎత్తి నెంబర్లు డైల్ చేసి నోటికొచ్చినట్లు తిట్టసాగాడు.

5

"యూ ఆర్ ఎ ఫూల్" అన్నాడు కమీషనర్ ఆఫ్ పోలీస్ మండిపడుతూ.

ఆ గదిలో నలుగురు పోలీస్ ఆఫీసర్లు వున్నారు.

విజయ సమాధానం చెప్పలేదు. స్మైల్ చేసి వూరుకుంది.

"పోస్టు గ్రాడ్యుయేట్‌వి. స్పోర్ట్సు వుమన్‌వి, కరాటే వచ్చినదానివి. కనీసం యస్పీ అన్నా అవుతావనుకున్నాను. డిపార్టుమెంటుకి పేరు తెస్తావనుకున్నాను" కమీషనర్ దీర్ఘంగా నిట్టూర్చాడు.

ఈ గొడవలో నుంచి యెలా బయటపడాలో అర్థం కావడం లేదు.

"ఇప్పుడు ఏమైంది సర్. పేపరువాళ్ళు మన డిపార్టుమెంటును పొగుడుతూ రాశారుగా!" అంది విజయ అమాయకంగా.

"డోంట్ సే నాన్సెన్స్. పేరు రావడం అంటే పేపర్లలో కాదు. మన పై అధికారుల్లో, పొజిషన్ పార్టీలో" అన్నాడు రొప్పుతూ. "నేను చెప్పినట్లు వింటే బతికిపోతావు."

"చెప్పండి సర్."

"కేస్ విత్ డ్రా చేసుకో!"

"ఎలా సర్? పేపర్లో స్టేట్ మెంటు యిచ్చానుగా?"

"ఎందుకిచ్చావ్? అఫ్ట్రాల్ నువ్వొక ప్రొబేషనర్ వి. ఏదైనా కేసుంటే పై అధికారులకు చెప్పాలి. వాళ్ళ గైడెన్స్ తీసుకోవాలి. అంతేగాని నీ యిష్టం వచ్చినట్లు పేపర్లో స్టేట్ మెంటు ఇస్తావా? అంతా నీ ఇష్టమేనా? ఛీ ...ఛీ....బుర్ర లేనిదానివి దొరికావు."

"మన డిపార్టుమెంటుకి మంచిపేరు రావాలని ఇచ్చాను సర్."

"నువ్వు అమాయకురాలివో గడుసుదానివో తెలియడంలేదు. అసలు నాకొక అనుమానం వస్తోంది. హోమ్ మినిష్టర్ తో నీ కేమైనా గ్రడ్జెస్ వున్నాయా?"

"నో....సర్! ఆయనెక్కడ? నేనెక్కడ?"

"మరి ఆ కుర్రాడు హోమ్ మినిష్టర్ కొడుకను దేవుడోయ్ అని మొత్తుకుంటున్నా వినకుండా వాయించేశావ్?"

"యస్ సర్! చట్టం ముందు అందరూ సమానమే కదా సార్! తప్పు చేసిందని ఎవరో అభాండం వేస్తేనే రాముడు సీతను వదిలేశాడు కదా సార్! ఆయనెవరో రాజు, కొడుకు నేరం చేస్తే ఉరిశిక్ష కూడా వేశాడు.... ఆయన పేరు...."

"డోంట్ టాక్ నాన్సెన్స్...."

"సర్! నేనేదో తప్పు చేసినట్లు మీరు రెచ్చిపోవడం బాగాలేదు. ఇప్పటిదాకా పెద్దవాళ్ళని వూరుకున్నాను" విజయ ముఖం సీరియస్ గా అయిపోయింది.

పోలీస్ కమీషనర్ ఖంగుతిన్నాడు. అతనికి విజయ

బాకింగ్ ఏమిటో అర్థంకావడంలేదు. ఒక ప్రొఫెసర్ హోమ్ మినిష్టర్ కొడుకుని అరెస్టు చెయ్యడం,లాకప్‌లో పడేసి కుళ్ళబొడవడం సామాన్యమైన విషయం కాదు. దీనికి ఏ పొలిటికల్ బాక్‌గ్రౌండ్ వుందో? లేకపోతే అంత ధైర్యం ఎక్కడుంటుంది?

'సమ్‌థింగ్ ఈజ్ దేర్.'

కమీషనర్ బుర్ర వేడెక్కిపోయింది. వెనుక గొయ్యి, ముందు నుయ్యిలా వుంది అతని పరిస్థితి.

'ఈ వక్రముండ తనని ఎదిరించేలట్లుంది' అనుకుని జుట్టు పీక్కున్నాడు.

సురేంద్రమీద కేసు బుక్ చేసి పోలీస్ అధికారులను ఇరుకులో పడేసింది విజయ.

కమీషనర్ వెళ్ళిపోయాక ఎ.సి.పి. వస్తాడని విజయకు తెలుసు. అతను అటు వెళ్ళగానే యస్.ఐ. పరమేశ్వర్‌కి చార్జి అప్పగించి ఇంటికి బయల్దేరింది. ఆమెకు ఇప్పుడు తృప్తిగా వుంది.

ఇరవై నాలుగు గంటలు గడిచేసరికి హోమ్ మినిష్టర్ మీద గందరగోళం ఏర్పడింది.

ఆ సమయంలో చీఫ్ మినిష్టర్ నగరంలో లేడు. ఢిల్లీలో కాన్ఫరెన్స్‌కి హాజరవడానికి వెళ్ళాడు. పేపర్లో ప్రముఖంగా పడిన వార్త చదివి ఐ.జి.కి ఫోన్ చేసి జరిగిందేమిటో తెలుసుకున్నాడు. చీఫ్ మినిష్టర్ తనను అడక్కుండా సరాసరి ఐ.జి.కి ఫోన్ చెయ్యడం హోమ్ మినిష్టర్ మనసుకి కష్టం కలిగించింది. అయినా చేసేదేం లేక వూరుకున్నాడు.

ఆ రోజు హోమ్ మినిష్టర్ యిల్లు వదిలి యెక్కడికీ పోలేదు. గిల్టీగా ఫీలై ఎవరికీ ముఖం చూపించలేక

పోయాడు. తోటి మంత్రులు ఫోన్ చేసి సానుభూతి తెలియజేశారు. చాలా ఫోన్లు వచ్చాయి. స్నేహితులు, శ్రేయోభిలాషులు ఫోన్లు చేశారు గాని అయ్యగారు ఇంట్లో లేరని చెప్పమన్నాడు. ముఖ్యమయినవాళ్ళతో నే మాట్లాడాడు.

మర్నాడు పేపరువాళ్ళు ఈ విషయంమీద సంపాదకీయాలు రాశారు. తన కొడుకుని అదుపు చేసుకోలేనివాడు రాష్ట్రంలో రౌడీలను, గూండాలను ఎలా కంట్రోల్ చేస్తాడన్నారు. రాను రాను ఆడపడుచులకు రక్షణ కరువైపోతున్నదని వాపోయారు. ప్రతిపక్షం నాయకులు దుమ్మెత్తిపోశారు. వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అతన్ని మంత్రివర్గం నుంచి తొలగించవలసిందిగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

సామాన్య కార్యకర్తగా రాజకీయాల్లో ప్రవేశించి మున్సిపాల్టీ కౌన్సిలర్‌గా, సమితి ప్రెసిడెంటుగా, కార్పొరేషన్ మెంబర్‌గా, ఎమ్మెల్లేగా, చివరకు మంత్రిగా ఒక్కొక్క మెట్టే ఎక్కిన హోమ్ మినిష్టర్ ఇమేజ్ ఒక్కసారిగా మురికాల్వలో పడిపోయినట్లయిపోయింది.

ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి రాజధానికి రాగానే తనను వెంటనే కలుసుకోవలసిందిగా హోమ్ మినిష్టర్‌కి కబురు పెట్టాడు.

హోమ్ మినిష్టర్ గుండె దడ దడ లాడింది. ఇక పదవికి నీళ్ళొచ్చినట్లే అనుకున్నాడు. కాబినెట్ రాంక్ నుంచి పడిపోయి మామూలు ఎమ్మెల్లేగా అసెంబ్లీలో కూర్చోవడం కంటే హుస్సేన్ సాగర్‌లో దూకి చావడం మేలు అనుకున్నాడు. ఈ న్యూసెన్సంతా కారణమైన కొడుకుమీద కోపం ముంచుకొచ్చింది. అడ్డు అపులేకుండా

అడ్డగాడిదలా తిరుగుతున్నాడు వెధవ!

గుండె చిక్కబట్టుకుని ముఖ్యమంత్రి ఇంటికి బయల్దేరాడు. ఆయనకి బి.పి. ఎక్కితే ఎంత మాటబడితే అంత మాట అంటాడు. నలుగురూ వున్నా లెక్క చెయ్యడు. లోగడ చాలాసార్లు పదిమందిలోనే కోప్పడ్డాడు. పదవి కోసం ఓర్చుకుని వుండాల్సొచ్చింది. తిట్టినా కొట్టినా ఆయన ధర్మాన చేసిన పదవిగదా! పదవివల్ల మనిషికి ఎంతో పవర్ వస్తుంది. పవర్‌తోపాటు డబ్బు, కార్లు, మేడలు అన్నీ వస్తాయి. అది లేకపోతే ఎన్నో సౌకర్యాలు పోతాయి. అయినా అందులో వుండే మజా సామాన్యులకు ఎలా అర్థమౌతుంది?

అదృష్టవశాత్తు ముఖ్యమంత్రి చాంబర్‌లో ఒక్కడే వున్నారు.

'హమ్మయ్య యిక యెన్ని తిట్టినా ఫర్వాలేదు' నిట్టూర్చాడు.

రెండు చేతులు ఎత్తి నమస్కారం చేశాడు. ముఖ్యమంత్రి చూసీ చూడనట్లు వూరుకున్నాడు. ఆయన ఎంతో గంభీరంగా కనిపిస్తున్నాడు. ఆయన్ని ప్రసన్నం చేసుకోవడానికి కాళ్ళమీద పడదామని అనుకున్నాడు గాని వీలుకాలేదు. ఎదురుగా టేబుల్ ఒకటి అడ్డం వుండిపోయింది.

"ఏమిటయ్యా ఈ న్యూసెన్స్ అంతా!" అని కొన్ని దినపత్రికలు విసిరికొట్టాడు ముఖ్యమంత్రి.

హోమ్ మంత్రి తల దించుకున్నాడు. ఏం మాట్లాడితే ఏం కొంప మునుగుతుందోనని లోపల భయం.

అరగంటసేపు వాయించి అలసిపోయాడు ముఖ్యమంత్రి.

"దిస్ ఈజ్ ఫైనల్ వార్నింగ్! ఈసారి ఏదైనా స్కాండల్ బైటపడితే నిన్ను డిస్మిస్ చేసి పరేస్తా!"

హోమ్ మంత్రి హృదయంలో పన్నీటిజల్లు కురిసింది.

'హమ్మయ్య! తన పదవి పోలేదు.'

ఆనందంతో ఎగిరి గంతులెయ్యాలనుకున్నాడు. వెంటనే విమానం ఎక్కి ఆ ఏడుకొండలవాడిని దర్శించుకుని తల నీలాలు సమర్పించుకోవాలి. స్వామి దయ తన మీద ఇంకా వున్నది.

"ఆ రాస్కెల్ ఏం చేస్తున్నాడు?"

"ఎవరు సార్?"

"అదేనయ్యా! నీ కొడుకు?"

"అమెరికాలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు సార్!"

"వెంటనే మాన్పించెయ్!"

"సార్"

"వాడికి డిసిప్లిన్ నేర్పించు ఇక్కడే. ఈ వయసులోనే పెద్ద గూండాగా మారిపోతే ఎలా? అంతా అమెరికా ప్రభావం. అక్కడ వాడికి అదుపు లేదు, అడిగేవాడు లేడు. నువ్వేమో అడిగినంత డబ్బు పంపిస్తుంటావ్! నో....దిస్ ఈజ్ టూ మచ్."

"సార్!"

"సిటీలోనే ఏదో ఒక ఇంజనీరింగ్ కాలేజీలో చేర్పించు. ఎటువంటి గొడవలు రాకుండా చూసుకుంటే నాలుగు రోజులు పదవిలో వుంటావు. తెలుసుగదా నీ పదవి ఎంత రెస్పాన్సిబిలిటీ గలదో! ఎలర్టుగా వుండాలి. ఎక్కడ లాకప్ మరణం జరిగినా, ఏ మారుమూల రేప్ కేస్ జరిగినా హోమ్ మంత్రి రాజీనామా చేయాలంటారు

జనం."

హోమ్ మంత్రి ముఖం పెనంమీద మాడిన పెసరట్టులా నల్లబడిపోయింది.

ఎట్లాగొట్లా అమెరికాలో ఇంజనీరింగ్ పూర్తిచేసుకొస్తే కోటిరూపాయల కట్నంతో పిల్లనివ్వడానికి పార్టీలు రెడీగా వున్నారు. ఇక్కడ చదివి, ఇక్కడే వుంటే అంత డిమాండ్ ఎక్కడిది?

హోమ్ మినిష్టర్ కొడుకు ఫ్యూచర్ గురించి లోలోపల విచారిస్తూ వుండగా యిక సెలవు తీసుకోమన్నారు ముఖ్యమంత్రి.

"జాగ్రత్త! వాడి చేతికి డబ్బు అందివ్వకు! డబ్బున్న దగ్గర్నుంచి నలుగురు ఫ్రెండ్స్‌ని పోగుచేసుకుని తాగి తందనాలు ఆడతాడు. బీ కేర్‌ఫుల్" అని హెచ్చరించాడు.

హోమ్ మంత్రి వడిలిన ముఖంతో తల వూపాడు.

6

షాపింగు ముగించుకుని యింటికి వెళ్ళేసరికి హాల్లో కూర్చొని భవానీదేవితో మాట్లాడుతున్నాడు డి.సి.పి.

"గుడ్ ఈవెనింగ్ సర్!" అంది విజయ.

డి.సి.పి. చిన్నగా నవ్వి గుడ్ ఈవెనింగ్ చెప్పాడు. అతను యింటికి యెందుకు వచ్చాడో గ్రహించింది విజయ.

"చూడమ్మా! నీకు డిపార్టుమెంటులో చాలా ఫ్యూచర్ వుంది. పొలిటికల్ వాళ్ళతో ఎడ్జెస్టు అయిపోవాలి. తప్పదు. పట్టు విడుపులేకపోతే నెగ్గుకురాలేం" అన్నాడు విజయతో.

"అవునమ్మాయ్! డిపార్టుమెంటులో అనుభవం వున్న వాడు. ఆయన చెప్పినట్లు విను" అంది భవానీదేవి.

"సారీ సర్! ఈ కేసులో మాత్రం నేను కాంప్రమైజ్ కాను" కొంచెం సీరియస్‌గానే చెప్పింది.

"మనం గట్టిగా నిలబడినంత మాత్రాన జరిగేది ఏమీ లేదు. నిన్ను అక్కడ్నుంచి ట్రాన్స్‌ఫర్ చేస్తారు. వచ్చే వాడు కేసు నీరు కారుస్తాడు. దట్సాల్."

"నాకు తెలుసు సర్, అలాగే జరుగుతుందని. కాని నాకు అదో తృప్తి. ఎవరి పిచ్చి వారికి ఆనందం అంటారే అలా అన్నమాట...." అని చిన్నగా నవ్వింది విజయ.

డి.సి.పి. కాసేపు మాట్లాడి వెళ్ళిపోయాడు.

"ఎందుకమ్మా నీ కింత పట్టుదల? వాళ్ళంతా పెద్ద వాళ్ళు. యేమైనా చెయ్యగల స్థితిలో వుంటారు. వాళ్ళతో అనవసరమైన విరోధం ఎందుకు?"

"అనవసరమైన విరోధం కాదమ్మా! అవసరమే!"

భవానీదేవి ఆశ్చర్యంగా మనవరాలివంక చూసింది.

విజయ నవ్వింది.

"మా నాన్నని చంపినవాడిలో వీడొకడు."

"నిజంగా?" నివ్వెరబోయింది భవానీదేవి.

"అవునమ్మా! వీడి పేరు కాటిల్యరావు. నాన్నతో పాటు ఫోటోలో వున్నాడు చూడు."

విజయ ఫోటోలో కాటిల్యరావుని చూపించింది. సన్నగా, లాల్చీ, పైజామా వేసుకుని వున్నాడు. ఇప్పుడో ఏనుగులా బలిసిపోయాడు. అతనే ఇతనని గుర్తుపట్టడం కష్టం.

"ఇప్పుడు అర్థమైందా? నేను ఇంత పట్టుదలగా ఎందుకు వున్నానో?" అంది విజయ.

"కాని ....వాడు హోమ్ మినిష్టర్. మరి నువ్వో....? ఎలా సాధిస్తావు అతన్ని."

"చూస్తుండు...." అంది విజయ కసిగా.

భవానీదేవి దిగులుగా కనిపించింది. ఎప్పుడో జరిగిన గొడవ జోగారావు చెప్పడం, దాన్ని తీసుకుని విజయ పగ తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చెయ్యడం ఆమెకు నచ్చలేదు. జరిగిందేదో జరిగిపోయింది. కొడుకు కోడలు వాళ్ల దుర్మార్గానికి బలైపోయారు. ఇరవై ఏళ్ళ తర్వాత వాళ్ళ మీద పగ తీర్చుకుని లాభం యేమిటి? అది అంత సులభమా? ఒకడు హోమ్ మినిష్టర్ గా ప్రత్యక్షమయ్యాడు. మిగిలిన ముగ్గురు ఎక్కడెక్కడున్నారో? వాళ్ళని మట్టుపెట్టడం అంత సులభంగా జరిగే పని కాదు. వాళ్ళు రాక్షసులు. ఎంత పనికైనా తెగించి వుంటారు.

ఎందుకొచ్చిన బాధ? హాయిగా నవ్వుతూ, తుళ్ళుతూ వుండాల్సిన వయస్సు. పెళ్ళి చేసుకుని భర్తతో సుఖంగా రోజులు వెళ్ళదీయాల్సిన సమయం. దాని పెళ్ళి చేసి నిశ్చింతగా వుండాలని ఎంతో ఆశపడింది.

కాని విజయ పట్టుదల చూస్తే తన కోరిక తీరేటట్లు కన్పించలేదు.

భవానీదేవి దీర్ఘంగా నిట్టూర్చింది.

విజయకు మెలకువ వచ్చి కళ్ళు తెరిచింది.

ఎదురుగా కిరణ్ నవ్వుతూ కన్పించాడు.

కలా? నిజమా? అనుకుంటూ కళ్ళు నలుముకుని మరీ చూసింది. కిరణ్ స్టిల్ లా కూర్చున్నాడు.

"కిరణ్!" అంది ఆశ్చర్యపోతూ.

"ఎందుకలా వండర్ అయిపోతున్నావ్?"

"ఎప్పుడొచ్చావ్?"

"రాత్రి పన్నెండు దాటింది. నువ్వు నిద్రపోతు న్నావ్. పాపం పగలంతా కష్టపడి డ్యూటీ చేసి వుంటావు. డిస్టర్బ్ చెయ్యడం ఎందుకని వూరుకున్నాను" అన్నాడు కిరణ్.

"రాత్రి సరే! ఇప్పుడు తెల్లవారింది కదా! నేను నిద్రపోతూ వుంటే చూస్తూ కూర్చున్నావా?"

"ఊఁ....నిద్రలో ఎంత అందంగా వున్నావో కదా! స్లీపింగ్ బ్యూటీ చూస్తూ కూర్చున్నాను."

"యూ....సిల్లీ...." అంది విజయ.

"నేను పేపరు చదువుతూ వుంటాను. నువ్వు స్నానం చేసి రా!" అన్నాడు కిరణ్ పేపర్ చేతిలోకి తీసుకుని.

విజయ అరగంటలో తిరిగివచ్చింది. పనిమనిషి ట్రేలో 'టీ' తెచ్చింది. ఇద్దరూ 'టీ' తీసుకున్నారు.

"ఏమిటి విశేషాలు?" ప్రశ్నించాడు కిరణ్.

"ఏముంటాయ్? నువ్వే చెప్పు పేపరు చదివావు కదా! నిన్న ఎన్ని రేప్ కేసులు జరిగాయి? ఎందరు అత్తలు కిరోసిన్ పోసి కోడళ్ళని తగలబెట్టారు? మంత్రుల కుంభకోణాలు కొత్తవి ఏమయినా బయట పడ్డాయా? వేటి మీద పన్నులు వేశారు?"

కిరణ్ పకపకా నవ్వాడు.

"అవన్నీ మామూలే."

"పోనీ మీ వూరి కబుర్లు చెప్పు" అంది విజయ.

"మా వూరు ఏమిటి? మీ వూరు కాదా? అక్కడ

మేడలు, తోటలు, పొలాలు అన్నీ మీకేగా!"

"ఎన్ని వున్నా మేము అక్కడ వుండేది ఏవుంది?"

"లేకపోయినా మీ వూరే! అది సరేగాని ఎలా వుంది వుద్యోగం?"

"బాగుంది కిరణ్! అధికారం నా టోపీలో వుంది. అహంకారం నా చేతి లాఠీలో వుంటుంది. కోపం వచ్చిందంటే ఎంతటివాడ్నయినా లాకప్‌లో పడేసి ఏదో నేరం నెత్తిన వేసి కుళ్ళబొడవొచ్చు."

"ఈ మధ్య పేపర్లో చూశా నీ పేరు. హోమ్ మినిష్టర్ కొడుకుని లాకప్‌లో వేశావటగా. మన వూళ్ళో వాళ్ళు గొప్పగా చెప్పుకుంటున్నారు నీ గురించి" అన్నాడు కిరణ్.

విజయ నవ్వింది గర్వంగా.

"ఛాన్స్ దొరికితే హోమ్ మినిష్టరినిగూడా లాకప్‌లో పడేస్తా!"

"ఆ పని చేశావంటే బోలెడంత పబ్లిసిటీ వస్తుంది. జాబ్‌కి రిజైన్ చేసేసి ఒక ప్రాంతీయ పార్టీ పెట్టొచ్చు."

"నీకు అంతా పరిహాసంగా వుందా?"

"లేదు మేడమ్! సిన్సియర్‌గా చెప్తున్నా"

"ఊఁ... ఊరక రారు మహాత్ములని, రమ్మని బ్రతిమాలినా రానివాడివి హఠాత్తుగా వూడిపడ్డావంటే ఏదో కారణం వుండివుంటుంది. చెప్పు ఎందుకు వచ్చావ్?"

"నీ పోలీసు బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు."

"పోలీసులకు వేరే బుద్ధి యెక్కడ్నుంచి వస్తుంది? ఒకటే బుద్ధి ఇంటా, బయటా."

"డ్యూటీకి వెళ్లాలంటే యెప్పుడొస్తావో యేమో?

ఎందుకయినా మంచిది ఇప్పుడే మనవి చేసుకుంటాను. మా నాన్న కూడా చనిపోయాక మరీ బోర్ గా వుంది. ఆ వూళ్ళో ఒకలు వుండ బుద్ధి కావడంలేదు. ఇప్పట్లో ఉద్యోగం వచ్చే సూచనలు గూడా కన్పించటంలేదు. తోడు యెవరయినా వుంటే బాగుంటుందని అనిపించింది. ఉద్యోగం వున్న అమ్మాయిని పెళ్ళి చేసుకుందామని అనుకుంటున్నాను" అన్నాడు కిరణ్.

"ఐయామ్ సారీ కిరణ్!" అంది విజయ సీరియస్ గా.

"వాట్?"

"ఇప్పట్లో పెళ్ళి చేసుకునే ఐడియా లేదు నాకు."

కిరణ్ అదిరిపడ్డాడు ఆమె మాటలు విని.

గుండె గుండు దెబ్బలు తిని తూట్లు పడినట్లు విలవిల లాడిపోయాడు.

7

"విజయా! నువ్వేనా మాట్లాడేది?"

హతాశుడయ్యాడు కిరణ్.

"యస్! నేనే కిరణ్."

"స్పీకేనయినా మతిపోయిందా?"

"మతిపోతే యెట్లా మాట్లాడుతున్నాను. ఐయామ్ ఆల్ రైట్!"

"ఏమైంది నీకు?"

విజయ మాట్లాడలేదు.

"చెప్పు విజయా! బీ ఫ్రాంక్. జాబ్ లో చేరాక నీ మనసు మారిపోయిందా?"

విజయ సమాధానం చెప్పలేదు.

"పాత రోజులన్నీ మర్చిపోయావా? చిన్నప్పటినుంచి వున్న అనుబంధం ఒక్కసారిగా ఎక్కడికి పోతుందను

ఉన్నావ్? మనం పెళ్ళిచేసుకోవాలనీ, ఎన్ని కలలు కన్నాం. అవన్నీ గుర్తులేవా?"

కిరణ్ నెమ్మదిగా అన్నీ గుర్తు చేస్తుంటే విజయ కళ్ళలో నీటి పొర కదిలింది.

"చెప్పు విజయా? పోనీ ఇక్కడ యెవర్నయినా ప్రేమించావా?"

"షటప్ యూ ఫూల్!" అంది విజయ కోపంగా.

కిరణ్ మనసు కుదుటపడింది. అతను భయపడుతున్నాడు. పెళ్ళి వద్దనడానికి కారణం వేరే ఎవర్నయినా ప్రేమించిందేమోనని. 'హమ్మయ్య' అని తేలికగా వూపిరి పీల్చుకున్నాడు.

"కిరణ్! నేను పెళ్ళికి విముఖంగా వుండడానికి నువ్వు ఊహిస్తున్న కారణాలు ఏవీ కాదు."

"మరి? వాటీజ్ యువర్ ప్రాబ్లమ్?"

"మేము చివరిసారిగా ఆనందపురం వచ్చినప్పుడు తెలిసింది కిరణ్! మా నాన్నకు సీరియస్‌గా వుందని నాకిచ్చిన టెలిగ్రామ్ అందుకుని మద్రాస్ నుంచి వచ్చాము గుర్తుంది కదా! అప్పుడు చెప్పాడు మా నాన్న, యెప్పట్నుంచో ఇరవై సంవత్సరాలుగా కడుపులో దాచుకున్న నిజాన్ని."

విజయ జరిగిందంతా చెప్పింది.

"అప్పటివరకూ నా జీవిత సర్వస్వం నువ్వే కిరణ్. జాబ్ చెయ్యాలని గూడా నేను ఏనాడు అనుకోలేదు. అటువంటి అవసరం గూడా నాకులేదు. కాని ఆ తర్వాత నా మనస్సు పగతో నిండిపోయింది. ప్రతీకారంతో కడుపు రగులుతోంది. నా తల్లిదండ్రుల్ని రాక్షసంగా చంపిన దుర్మార్గుల్ని నాశనం చెయ్యందే నా మనస్సు శాంతించ

దని తెలుసుకున్నాను."

"విజయా! "

"నన్ను చెప్పనీ కిరణ్! వాళ్ళని చంపినందువల్ల, నాశనం చేసినందువల్ల ఇప్పుడు లాభం ఏమిటి అని నువ్వు ప్రశ్నించవచ్చు. నేను ఖచ్చితంగా చెప్పలేనుగూడా! దుర్మార్గానికి బలైపోయినవాళ్ళు పగ, ప్రతీకారం ఎందుకు తీర్చుకుంటారో నాకు తెలిసేదికాదు. ఇప్పుడు స్పష్టంగా అర్థమైంది. పగ తీర్చుకోవడంవల్ల మనస్సు శాంతిస్తుంది. రగిలే గుండె చల్లారుతుంది. తృప్తి కలుగుతుంది జీవితంలో ఏదో సాధించామని. దట్సాల్ కిరణ్. ఈ విషయంలో వెనక్కి మళ్ళే ప్రశ్నలేదు. నో సెకండ్ థాట్."

విజయముఖం ఎర్రబడింది. ఆవేశంతో ఆమె పెదవులు అదురుతున్నాయి.

"ఐయామ్ సారీ కిరణ్. నిన్ను ఎంతో బాధపెట్టి వుంటాను. ఈ గొడవలో నిన్ను ఇరికించడం నాకు ఇష్టం లేదు. ఇప్పటి పరిస్థితిలో నలుగురు ఘరానా పెద్ద మనుషుల్ని నాశనం చెయ్యడం సామాన్యమైన విషయం కాదు. చాలా రిస్క్‌తో కూడింది. ఏ క్షణంలోనైనా నేను ఓడిపోవచ్చు. ప్రాణాలు పోగొట్టుకోవచ్చు. నాకు తెలుసు అవన్నీ. అయినా సరే నేను పట్టువిడవను." దృఢ నిశ్చయంతో చెప్పింది విజయ.

"విజయా! నా గురించి నువ్వు ఎంత నీచంగా ఆలోచిస్తున్నావో నాకు అర్థమైంది. ఇంతేనా నువ్వు తెలుసుకుంది. నువ్వు ప్రాణాలు పణంగా పెట్టి పోరాడుతూ వుంటే నేను చేతగానివాడిలా చేతులు ముడుచుకుని కూర్చుంటానా? చావో! బతుకో నీతోపాటే నేనూ!"

విజయ అబ్బురంగా చూసింది అతన్ని.

"కిరణ్ ...." అంది ఆనందంగా.

మరుక్షణం అతని చేతుల్లో వాలిపోయింది. ఆమెను హృదయానికి హత్తుకుని తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు కిరణ్.

"నువ్వు రెష్టు తీసుకో కిరణ్. డ్యూటీకెళ్ళొస్తాను." అంది విజయ.

కిరణ్ తలవూపాడు.

విజయ వెళ్ళేసరికి స్టేషన్‌లో హడావుడిగావుంది. రేప్ కేసు గొడవో, మర్డర్ కేసో అనుకుంటూ వెస్పాకి స్టాండ్ వేసి లోపలకు వెళ్ళింది.

సి.ఐ. ఎదురుగా డి.సి.పి. కూర్చున్నాడు.

ఇద్దరికీ గుడ్‌మార్నింగ్ చెప్పింది. కాని వాళ్ళు సర్రీడ్‌గా కనిపిస్తున్నారు. ముఖాలు మాడ్చుకుని సీరియస్‌గా వున్నారు.

"మీరొకసారి డి.జి.పి. దొరని కలుసుకోండి." అన్నాడు. సి.ఐ.

విజయ ఏమీ మాట్లాడలేదు.

వెస్పా తీసుకుని డి.జి.పి. దగ్గరికి బయల్దేరింది.

"నువ్వేనా విజయ అంటే?" గంభీరంగా అన్నాడు డి.జి.పి.

"యస్ సర్." అంది విజయ అంతకంటే గంభీరంగా.

"నీకు వుద్యోగం చెయ్యాలని లేదా?"

"చెయ్యాలని వుండబట్టే చేస్తున్నాను సర్."

"అప్పారావ్ నువ్వొక ప్రొఫెసర్‌వి. హోంమినిష్టర్ కొడుకుని లాకప్‌లో పెడతావా? వాడూ యూమీన్."

"నా డ్యూటీ చేశాను సర్."

"నెత్తిన టోపీ పెట్టుకోగానే కిరీటం పెట్టినట్లు రెచ్చి పోతున్నావా? ఖాకీ బట్టలు కట్టుకోగానే నీదే రాజ్యం అనుకుంటున్నావా? మైండ్ యువర్ బిజినెస్." డి.జి.పి. కంఠం హెచ్చించాడు.

విజయ సీరియస్‌గా చూసింది.

"నన్ను ఎందుకు పిలిపించారో చెప్పండి."

"విత్‌డ్రా యువర్ కేస్. కోపరేట్ విత్ ఆఫీషియల్స్ అండ్ డిపార్ట్‌మెంట్."

"ఐయామ్ సారీ సర్."

"యూ ! ఆఫ్టరాల్ ప్రొబేషనర్. ఐ విల్ సస్పెండ్ యూ! ఐ విల్ డిస్మిస్....యూ!" డి.జి.పి. కేకలు పెట్టాడు.

"యూ కెన్ డూ వాటెవర్ యూ లైక్." చెప్పింది విజయ.

డి.జి.పి. కేకలు పెడుతూనే వున్నాడు.

విజయ అక్కణ్నుంచి చరచర వెళ్ళిపోయింది. ఆమె ప్రవర్తన పుండుమీద కారం చల్లినట్లయింది డి.జి.పి.కి.

పళ్ళు కొరికాడు.

'ఇరవై నాలుగు గంటల్లోగా ఆ యువై ఎవత్తో, దాంతో కేస్ విత్‌డ్రా చేయించండి.' అని హోమ్ మినిష్టర్ ఇచ్చిన వార్నింగ్ చెవుల్లో మ్రోగుతోంది డి.జి.పికి.

ఆమె ఎవరోగాని మొండి ఘటంలా వుంది. ఇప్పుడేం చెయ్యాలి? హోమ్ మినిష్టర్‌కి ఏం సమాధానం చెప్పాలి?

'వాటే హెల్' అని తిట్టుకున్నాడు.

సిటీ పోలీస్ కమీషనర్‌కి ఫోన్ చేశాడు.

"సర్."

"ఆ లేడీ యస్సై నా మాట గూడా వినేదయ్యా! ఇటువంటి మొండి ఘటాన్ని నా సర్వీస్‌లో చూళ్ళేదు. రాడికల్ లేడీ."

"సర్. నాకు అనుమానంగావుంది. పొలిటికల్ బాకింగ్ ఏదైనా వుందేమోనని! లేకపోతే అప్ట్రాల్ ఒక యస్సై మనల్ని ఎదిరించడమా? డిపార్ట్‌మెంట్ హిస్టరీలోనే లేదు."

"వాటెవ్వర్ షి ఈజ్? డిస్మిస్ ఇమ్మీడియట్లీ."

"కొంప మునుగుతుంది సర్. ప్రతిపక్షాల వాళ్ళు గొడవ చేస్తారు. అది కోర్టు కెళ్ళిందంటే స్టే ఆర్డర్ ఇస్తారు."

"దెన్. వాడూయూసే?"

"ట్రాన్స్‌ఫర్ చేద్దాం సర్."

"డూ ఇట్." అని రిసీవర్ విసిరికొట్టాడు డి.జి.పి.

డ్యూటీ దిగి వెళ్ళబోతుంటే ఒక కవరు అందించి సంతకం చేయించుకున్నాడు సి.ఐ.

"వాటీజ్ దిస్ సర్?" ప్రశ్నించింది విజయ.

"యువర్ ట్రాన్స్‌ఫర్." నవ్వాడు సి.ఐ. పొగరణిగిందా అన్నట్లు హేళనగా చూశాడు.

విజయ జేబులోనుంచి కాగితం తీసి సి.ఐ.కి అందించింది.

"వాటీజ్ దిస్?" అన్నాడు సి.ఐ.

"నా రాజీనామా!" అంది విజయ.

సి.ఐ. షాక్ తిన్నాడు.

8

కిరణ్ ఆ ఫోటోని తదేకంగా చూస్తున్నాడు. కనీసం పాతికేళ్ళు దాటి వుంటుంది ఫోటో తీసి. తెలుపునుంచి మట్టిరంగుకి మారింది. ఫోటోలోవున్న వాళ్ళ పేర్లు

ఇంగ్లీషులో ప్రింట్ చేసి వున్నాయి. ఎడమనుంచి కుడికి. కాటిల్యరావు. రాజేంద్రకుమార్, బ్రహ్మాజీ పేరుకి బ్రాకెట్లో జమీందార్, ఆనందపురం అని వుంది. బ్రహ్మాజీ ప్రక్కన ఆయన భార్య సుజనాదేవి కూర్చుంది. ఆమె తర్వాత అవతారకృష్ణ, కేష్స.

స్కూటర్ శబ్దం వినిపించింది.

టైమ్ చూశాడు. పన్నెండు దాటింది. రెండుగంటల తర్వాత వస్తాననీ, లంచ్ చేసెయ్యమని, తనకోసం ఎదురు చూడొద్దని చెప్పి వెళ్ళింది విజయ. అప్పుడే వచ్చేసిందే! తను వున్నాడని వచ్చిందేమో అనుకున్నాడు.

విజయ ముఖం సీరియస్‌గావుంది. ఏదో జరిగిందని అనుకున్నాడు.

"కిరణ్! నేను రిజైన్ చేశాను." చెప్పింది విజయ.

"వాట్ హేపెండ్ విజయా?"

విజయ జరిగినదంతా చెప్పింది.

"డోంట్ వర్రీ, మనం చెయ్యబోయే పనికి నీ జాబ్ ఒక రకంగా ఆటంకమే." అన్నాడు కిరణ్.

విజయ ముఖంలో రిలీఫ్ కన్పించింది. యూనీఫాం తీసేసి చీర కట్టుకుని వచ్చింది.

"కాటిల్యరావు పోతే మిగిలిన ముగ్గురు ఎక్కడున్నారో తెలుసా?" అడిగాడు కిరణ్.

విజయ తల అడ్డంగా వూపింది.

"ముందు ఎవరు ఎక్కడున్నారో తెలుసుకోవాలి. దటీజ్ ఇంపార్టెంట్." అన్నాడు కిరణ్.

"ముగ్గురు సంగతి తర్వాత. కాటిల్యరావు ఇక్కడే వున్నాడుగదా! వాడి సంగతి చూద్దాం" అంది విజయ.

"యూ ఆర్ రాంగ్ విజయా!"

"వాటీజ్ రాంగ్?"

"కౌటిల్యరావు సామాన్యుడు కాదు. హోమ్ మినిష్టర్ ఆ సంగతి మర్చిపోతున్నావు."

"కావచ్చు."

"అతన్ని ఎలా చంపుతావో? నీ ప్లాన్ చెప్పు?" ప్రశ్నించాడు కిరణ్.

"ఎలా చంపాలో, ఎక్కడ చంపాలో ఇంకా నిర్ణయించుకోలేదు. అతను ఎప్పుడూ టూర్స్‌లో వుంటాడు. ఏదైనా ఒక చిన్న వూళ్ళో ఆగినప్పుడు రివాల్వర్‌తో కాల్చి చంపుతాను."

"అదంత తేలిక కాదు. మినిష్టర్ ప్రోగ్రామ్స్‌లో ఎప్పుడూ సెక్యూరిటీ గార్డ్స్ వుంటారు. హోమ్ మినిష్టర్‌కి ఇంకా ఎక్కువగా వుంటుంది ప్రొటెక్షన్. సరే గార్డ్స్ ఎలర్టుగా లేని సమయం చూసి కాల్చుతానంటావ్. అప్పుడు నీ గురి తప్పవచ్చు. వాడి అదృష్టంకల్ల బులెట్ తగిలినా ప్రాణం పోకపోవచ్చు. ఆ తర్వాత నువ్వెలా తప్పించుకుంటావ్? గార్డ్స్ ఎదురుకాల్పులు జరుపుతారు. నిన్ను వెంటాడుతారు. దొరికిపోతే?"

"ఐ విల్ టేక్ ది రిస్క్."

"చంపడంలో రిస్క్ ఎప్పుడూ వుంటుంది. మొదటి వాడిని చంపడంలోనే పట్టుబడిపోతే ఇంకా ముగ్గురు మిగిలిపోతారు" అన్నాడు కిరణ్.

"యస్!" అంది విజయ సాలోచనగా.

"ఆవేశానికి లొంగిపోకుండా ఆలోచించు. శత్రువు బలవంతుడయినప్పుడు బుద్ధిబలంతోనే జయించాలి."

"యూ ఆర్ రైట్ కిరణ్! నాకిప్పుడు చాలా ధైర్యంగా వుంది. ఒంటరిగా అయితే ఆవేశంలో

ముందూ వెనుకా చూసుకోకుండా దూకేదాన్ని. ఒక్కడి తోనే పట్టుబడిపోయేదాన్నేమో! ముగ్గురు మిగిలి పోయే వాళ్ళు. అప్పుడు నాకు యే తృప్తీ మిగిలేది కాదు" అంది విజయ.

కిరణ్ చిన్నగా నవ్వాడు.

"ప్రస్తుతానికి హోమ్ మినిష్టర్ని వదిలేద్దాం."

తల వూపింది విజయ.

"మిగిలిన ముగ్గురు ఎక్కడున్నారో కావాలి మనకి. నీకేమయినా ఐడియా వుందా?"

"నో...." అంది విజయ.

"మీ నాయనమ్మకి కొన్ని వివరాలు తెలిసివుంటాయి. అడుగుదాం" అన్నాడు కిరణ్.

విజయ, భవానీదేవిని పిలిచింది.

"ఆంటీ! నేను అడిగేవాటికి జాగ్రత్తగా జవాబు చెప్పాలి" అన్నాడు కిరణ్.

భవానీదేవి ఆ ఫోటో వైపు చూసి "అయితే నీకూ చెప్పిందన్నమాట ఆ గొడవ" అంది.

"నేను విజయకి తోడుగా వుంటాను ఆంటీ! విజయ, నేనూ ఒకటిగా పెరిగాం. జీవితాంతం కలిసి వుండాలను కున్నాం. అలాగే వుంటాం."

"కిరణ్! నీకూ పిచ్చిపట్టినట్లుంది. దానికి బుద్ధి చెప్పా ల్సింది పోయి వత్తాసు పలుకుతున్నావా?" సీరియస్‌గా అంది భవానీదేవి.

"సారీ ఆంటీ! విజయ మొండితనం నీకు తెలుసు."

"ఇది నాటకం కాదు, సినిమా కాదు. జీవితం. పగ తీర్చుకోవడం, చంపడం అంత సులభం కాదు. వాళ్ళు

ఇప్పుడు యెక్కడున్నారో గూడా తెలియదు."

"అమ్మా! నాకు మాటి మాటికి నీతులు చెప్పొద్దు" సీరియస్‌గా అంది విజయ.

"ఆంటీ ప్లీజ్....ఇక ఆ విషయంమీద డిస్కషన్స్ వద్దు. మాటకి మాట తెగులు. జరిగేది జరక్క మానదు" అన్నాడు కిరణ్.

అక్కడ వాతావరణం గంభీరంగా మారిపోయింది. ఈ వ్యవహారం భవానీదేవికి ఏ మాత్రం యిష్టం లేదని కిరణ్‌కి అర్థమైంది.

"ఆంటీ! ఈ ఫోటోలో వున్న వాళ్ళ గురించి మీకు తెలిసింది ఏమైనా వుంటే చెప్పండి."

"అందులో అవతార కృష్ణ గురించే నాకు తెలుసు. వాడు అబ్బాయి క్లాస్‌మేట్. ఆ ముగ్గురు ఎవరో నాకు తెలీదు. చదువు పూర్తయ్యాక అవతారకృష్ణ హైదరాబాద్‌లో స్టీలు వ్యాపారం చేస్తున్నాడని చెప్పాడు. వాళ్ళు ముగ్గురూ అతని స్నేహితులు" చెప్పింది భవానీ దేవి."

"అవతారకృష్ణ అడ్రస్ తెలుసా?"

ఆమె తల అడ్డంగా వూపింది.

కిరణ్ కొన్ని నిముషాలు ఆలోచనలో పడిపోయాడు. అవతారకృష్ణ ఎక్కడున్నాడో తెలుసుకుంటే, మిగిలిన ఇద్దరు బయటపడిపోతారు. కాని ఎలా?

అతని బుర్రలో ఫ్లాష్ వెలిగింది.

టెలిఫోన్ డైరెక్టరీ తీశాడు.

నెంబర్స్ డైల్ చేశాడు.

(ఇంకా వుంది)